"అసలు నన్నడుగుతే మన ఇండియాలో ప్రతి అబ్బాయినీ ఓ ఏడాదీ రెండేళ్ళు అమెరికా పంపాలంటాను. ఇక్కడికి వచ్చి కష్టపడి చదువుకుంటూ తన పని తాను చేసుకుని, వండుకుని తిని "డిగ్నిటీ అఫ్ లేబర్" అంటే అర్థం అయి ఆ "మేల్ ఇగో" చావాలంటే ప్రతి అబ్బాయినీ ఇక్కడ ట్రైనింగ్‌కి అన్నట్టు పంపాలి. ఆడ మగ సమానం అన్నది అర్థం కావాలంటే యిక్కడొచ్చి వుండాలి. మన కుర్రాళ్ళకి ఉద్యోగానికి ముందు ఓ ఏడాది మిలట్రీ ట్రైనింగ్, పెళ్ళికి ముందు అమెరికా ట్రైనింగ్ యిప్పిస్తేగాని యీ మగాడి జులుంలు, ఇగోలు వదలవు-యీ విషయంలో మనం అమెరికన్స్‌ని చూసి ఎంతన్నా నేర్చుకోవాలి" ప్రతీక్ష అంటున్న మాటలకి అప్రయత్నంగానే తల ఆడించింది కాత్యాయని.

(ఆం. జ్యోతి న్యూజర్సీ పోటీ బహుమతి కథ 1993)

★

# ఈ దేశంలో ఆడది!

జయంతి బస్సుదిగి గబగబ యింటివైపు అడుగులు వేయడం మొదలు పెట్టింది. ఈ రోజు రోజూకంటె గంటాలశ్యం అయిపోయింది. కనుచీకటి పడి పోతూంది అప్పుడే, పిల్లలు పాపం ఏం చేస్తున్నారో, యింకా రాలేదని బెంగ పడ్తున్నారేమో, మొదటి బస్సు తప్పిపోయింది, రెండో బస్సు వచ్చేసరికి అరగంట పట్టింది. యింటికి తొందరగా చేరాలన్న ఆరాటంతో పరిగెత్తినట్టే నడుస్తూంది జయంతి. పిల్లలు నాలుగున్నరకే రోజూ వస్తారు. ఆమె యిల్లు చేరేసరికి ఐదున్నర, ఆరు మధ్య అవుతుంది. స్కూలు వదిలాక రెండు బస్సులు మారిరావాలంటే ముప్పావుగంట తక్కువ పట్టదు. పిల్లల కోసం కటకటాల వరండాలో హార్లిక్స్ సీసాలో పాలుపోసి, రెండు ప్లాస్టిక్ గ్లాసులు, ఒక నీళ్ళసీసా, యిద్దరికి చెరో రెండు బిస్కట్లు గాని, బ్రెడ్‌ముక్కలు గాని ఉదయం వెళ్ళేటప్పుడు పెట్టిపెడ్తుంది. పిల్లలు వీధి తాళం తీసుకుని వరండాలో పెట్టినవి తిని చుట్టుప్రక్కల పిల్లలతో ఆడుకుంటూ వుంటారు.

జయంతి యిల్లు చేరేసరికి రోజు మాదిరి పిల్లలు ఆడుకోకుండా వరండా ముందున్న మెట్లమీద కూర్చున్నారు. వాళ్ళిద్దరి మధ్య ఎవరో వ్యక్తి కూర్చున్నారు.

తను చీకటిలో దగ్గరికి వచ్చేవరకు గుర్తుపట్టలేక పోయింది జయంతి. గుర్తుపట్టగానే స్థాణువులా నిలబడిపోయింది. "అమ్మ వచ్చేసింది నాన్నా అమ్మ వచ్చేసింది. అమ్మా నాన్న వచ్చారు." పిల్లలిద్దరూ లేచి నిలబడి తల్లి దగ్గరకు పరిగెత్తి సంతోషంగా చెప్పారు. జయంతి కాళ్ళల్లో శక్తి పోయినట్టు ఒక్క అడుగూ ముందుకు వేయలేక పోయింది. ఈ మనిషి ఎందుకు వచ్చినట్లు ఇప్పుడు!? రెండేళ్ళ క్రితం నిర్దాక్షిణ్యంగా బాధ్యతారహితంగా పున్నపాటున చెప్పాపెట్టకుండా తన ఖర్మానికి తనని వదలి వెళ్ళిన యీ మనిషి రెండేళ్ళ తరువాత హఠాత్తుగా యిలా ఎందుకు వచ్చాడు? ఆమె శరీరం అంతా కోపంతోనూ బాధ ఆవేదనతోనూ కంపించింది. "గెటౌట్. పోబయటకు వెంటనే" అని అరిచిందా అరవలేదు. అరవాలనుకుంది. కానీ నోట్లోంచి మాట రాలేదు. నెమ్మదిగా అతను ముందుకు వచ్చాడు "జయా నేనే. అలా చూస్తున్నావేమిటి. వచ్చి అప్పుడే గంట అయింది. నీవింత ఆలశ్యంగా వస్తావనుకోలేదు" అన్నాడు. రోజూ భార్య స్కూలు నుంచి వచ్చినప్పుడు పలకరించినంత మామూలుగా, రెండేళ్ళ తరువాత వచ్చిన మనిషి పలకరించాడు. ఏం జరగనట్టు అంత నిర్వికారంగా, మాట్లాడుతున్న అతన్ని చూసి తెల్లబోయింది. నెమ్మదిగా కాలు చేయి కూడదీసుకుని మాట్లాడకుండా బ్యాగులోంచి తాళం తీసి తలుపు తెరిచింది. లైటు వేసింది. ఆ లైటు వెలుగులో గుమ్మానికి అడ్డుగా నిలబడి "ఎందుకు వచ్చారు!" కఠినాతి కఠినంగా ప్రశ్నించింది. అతని వంక తిరిగి, పిల్లలిద్దరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఆ ప్రశ్నకి ఎదురు చూడనట్టు అతను తడబడి "అదేమిటి.... నిన్నూ పిల్లలని చూద్దామని...." ఏదో చెప్పబోయాడు.

"చూశారుగా యింక వెళ్ళండి" మళ్ళీ కఠినంగా అంది.

"అదికాదు జయా చూడ్డానికి కాదు. చూడ్డానికేమిటి. నా వాళ్ళున్నారని వచ్చాను. ఏం తప్పా. రాకూడదా, యిలా మాట్లాడుతున్నావేమిటి?" నవ్వాలని ప్రయత్నించాడు. జయ నవ్వలేదు. తీక్షణంగా అతని వంక చూసింది. "మీ వాళ్ళు.... ఎవరూ మీ వాళ్ళు? మెడలో తాళికట్టి పదేళ్ళు కాపురం చేసిన భార్యని, పసికందులనైనా ఆలోచించకుండా నిర్దాక్షిణ్యంగా, బాధ్యతారహితంగా, పిరికి పందలా చెప్పనైనా చెప్పకుండా వదలి పారిపోయిన నాడే వాళ్ళు మీ వాళ్ళుకాదు. ఇంకా రెండేళ్ళ తరువాత యింకా మీ వాళ్ళుగా మిగులుతారని ఏం మొహం పెట్టుకు ఆశించి వచ్చారు!"

"జయా! నేను నిన్ను కట్టుకున్న మొగుడిని. వాళ్ళు నా పిల్లలు అని మర్చిపోయినట్లున్నావు. గుమ్మంలోకి వచ్చిన మనిషితో మాట్లాడవలసిన తీరు యిదేనా,

మంచి మర్యాద లేకుండా యిలా నిలబెట్టి" కోపం ధ్వనించింది అతని గొంతులో. "మంచి మర్యాద....అవి మానవత్వం వున్న మనుషులకి. అవి మర్చిన మీలాంటి అధములకి కాదు. భర్త అంటే భరించే వాడు. భరించకుండా భారం భార్యమీద మోపి పారిపోయిన వాడు భర్తెలా అవుతాడు. మీకు నాకు యింక ఏ సంబంధం లేదు. దయచేసి మీరు వెళ్ళొచ్చు రెండేళ్ళనాడే మీరు నాకు లేనివారితో సమానం, వెళ్ళండి. మా ఖర్మానికి మమ్మల్ని వదలి దయచేసి వెళ్ళండి. మాకు మీకు యింకే సంబంధం మిగలలేదు "వెళ్ళండి....వెళ్ళిపోండి" అర్చింది జయ. అతని మొహం ఎర్రబడింది. కళ్ళల్లో అవమానం, క్రోధం ఆడదానిచేత, కట్టుకున్న పెళ్ళాంచేత అంత అవమానపడటం అతని అహంకారం మీద దెబ్బతీసింది. "నీవు సంబంధం లేదంటే పోవడానికి యిదేం బొమ్మల పెళ్ళి కాదు! నీవు నేను విడాకులు పుచ్చుకునే వరకు నేను నీ మొగుడినే, వీళ్ళు నా పిల్లలే. నా హక్కుని లేదనేటందుకు నీకు హక్కులేదు." గర్వంగా యిప్పుడేం చెపుతావు అన్నట్టు తల ఎగరేశాడు. జయంతి అతనివంక తిరస్కారంగా చూసింది.

"రవీ, స్వర్ణా మీరిద్దరూ ఆంటీ యింటికి వెళ్ళి కాసేపు ఆడుకోండి నేను పిలిచేవరకు" అంది పిల్లలిద్దరితో. పిల్లలిద్దరూ బయటికి వెళ్ళాక "మిస్టర్ సూర్యారావు ఒక ఆడదాని మోజులో కట్టుకున్నదాన్ని వదిలి పిల్లలని వదిలి వెళ్ళిన నీవు ఆ ఆడది తన్నితగిలేస్తేనో లేక ఆ మోజు తీరగానే మళ్ళీ భార్య దగ్గరకి చేరడానికి సిగ్గులేదూ నీకు, నీవు ఒక మగవాడివయితే మళ్ళీ నా దగ్గరికి రావు. నన్ను బెదిరించి నీ జులుం సాగించాలనుకోకు. ఎటువంటి పరిస్థితిలోనూ నేను నిన్ను భర్తగా అంగీకరించను, అండర్‌స్టాండ్. అంచేత నీ హక్కులు నీవు పొందాలనుకుంటే కోర్టు కెక్కు అంతేగాని, యీ గుమ్మంలో నిలబడి నన్ను బెదిరించాలనిమాత్రంచూడకు. నీవు చేసిన పనికి నా హృదయంలో ఓ సున్నితపు పొర చిరిగిపోయింది. ఈ రెండేళ్ళు నేపడిన కష్టాలతో, సమస్యలతో, బాధలతో నా హృదయం బండబారింది. ఇప్పుడు వంటరిగా యీ లోకంలో ఏ యిబ్బందినైనా ఎదుర్కొగల మనస్థైర్యం సంపాదించు కున్నాను. అంచేత యిక నీ బెదిరింపులకి బెదరను. ఒక ఆడది కట్టుకున్న భర్తని, తన పిల్లలు తండ్రిని యింతలా ఏహ్యించుకుని యిలా మాట్లాడిందంటే ఆమెని ఆ భర్త ఎంతలా దెబ్బ తీశాడో, ఎంత మోసంచేసి ఆమెని గాయపరిచాడో ఎవరికన్నా అర్థం అవుతుంది. నీకు అర్థంకాక వచ్చావో, అర్థమయి వేరే దారిలేక వచ్చావో నాకనవసరం. పోయిన మనశ్శాంతి యిప్పుడిప్పుడే పొందుతూ శాంతిగా బతుకు తున్న నా జీవితంలోకి మళ్ళీ రావాలని ప్రయత్నించకు. వెళ్లు ప్లీజ్ గో ఎవే...." తీవ్రంగా అంది. ఆమె మొహంలో కనపడిన స్థిర నిశ్చయానికి, ధైర్యానికి అతను మనసులో కొంత జంకాడు.

ఇది అతనూహించని పరిస్థితి. కాసేపు తిడ్తుంది, ఏడుస్తుంది– "ఎలా వదిలి పోయారు, ఎలా బతుకుతామనుకున్నారు. మమ్మల్నిలా వదిలిపోతే" అని ఏడుస్తుంది. తను తప్పయింది క్షమించమని కన్నీళ్ళు పెట్టుకుంటే కరిగిపోతుంది - కౌగిలిలోకి లాక్కుంటే కరిగిపోతుంది. కథ సుఖాంతం అవుతుంది. అని ఆశించి ధైర్యంగా వచ్చాడు. జరిగినదానిలో తన తప్పు స్వల్పం. ఆ మాయలాడి వలలో వేసుకుంది. "నా కళ్ళు పొరలు కమ్మాయి నా మనసు వశం తప్పింది. ఆ మాయలో పడి అదేం చేయమంటే చేశాను. నా కళ్లు విచ్చుకునేసరికి ఆలస్యం అయిపోయింది." అంటూ తప్పు ఆమె మీద తోసి "నీకు మొహం చూపలేక సిగ్గుతో లజ్జతో నేను చేసిన వెధవ పనికి యిన్నాళ్ళు కుమిలిపోయి నీ దగ్గరికి రాలేకపోయాను. నీతో అంతా చెప్పుకుని నిన్ను క్షమాపణ కోరాలని నీ క్షమాపణ దొరకనిదే యిక్కడనించి కదలకూడదని వచ్చాను జయా నన్ను క్షమించగలవా" అని దీనంగా ప్రాధేయపడితే కరగని భార్య వుండదన్న విశ్వాసంతో చాలా నమ్మకంగా వచ్చాడు. అతని అంచనాలు అన్నీ తారుమారు అయిపోయాయి. జయంతి యింత నిర్భయంగా, ఇంత ధైర్యంగా యింతలా తనని నిలబెట్టగలదని అతనూహించలేదు. ఇప్పుడేం చెప్పి ఆమెని లొంగ దీసుకోవాలో అర్థంకాలేదు. జయ కళ్ళల్లో తిరస్కారం ఏదన్నా ఎదుర్కోగలనన్న నిబ్బరం చూసి ఆఖరి అస్త్రంగా "జయా, నాకేం గతిలేక నీ దగ్గరకి వచ్చాననుకుం టున్నావేమో, పోనీ కట్టుకున్నదానివి, నా పిల్లలున్నారని వచ్చాను. నీకు అంత మొగుడు అక్కరలేకపోతే నాకూ పెళ్ళాం అక్కరలేదు, నాకు పెళ్లాం కావాలంటే యింకా చాలామందే దొరుకుతారు కాని, నా పిల్లలు నాకు కావాలి, వాళ్ళని మాత్రం వదలను. నా పిల్లలని నా వెంట పంపు యిప్పుడే యీ క్షణమే తీసుకువెడతాను" బింకంగా అన్నాడు. జయ మొహం కళ తప్పడం, ఆమె కళ్ళల్లో కలవరపాటు చూసి గర్వంగా నవ్వుకున్నాడు.

"ఇప్పుడేం చేస్తావు" అన్నట్టు సవాల్ చేశాడు.

"రెండేళ్ళనాడు నిర్దాక్షిణ్యంగా వదిలి వెళ్ళినప్పుడు జ్ఞాపకంరాని పిల్లలు యిప్పుడు కావలసివచ్చారా ఆ పిల్లలు సాకు అడ్డుపెట్టుకుని నన్ను బెదిరించి లొంగ దీసుకోవాలనుకునే మీ నీచబుద్ధి నాకర్థం అయింది– ఆ పిల్లలకి కన్నతల్లి ని తండ్రి వదిలితే కష్టపడి నేను పెంచుకున్నాను. నా హక్కు ఏ కోర్టు లేదంటుందో నేనూ చూస్తాను. కోర్టుకెక్కి కోర్టు చెప్పేవరకూ నేను పిల్లలని వదలను. వెళ్ళండి పిల్లలు కావాలంటే కేసు పెట్టుకోండి ముందు నా యింట్లోంచి వెళ్ళి మీకు చాతనయింది చేసు కోండి." మనసులో భయంగా వున్నా అతని ముందు తగ్గిపోవడం యిష్టంలేక, తగ్గి నట్టు కనిపిస్తే తన మీద జులుం చలాయిస్తాడని లేని ధైర్యం తెచ్చుకుని బింకంగా అంది.

"కేసు పెట్టుకోవల్సింది నీవు ఏ కేసు లేకుండా పిల్లలు తండ్రికి చెందుతారని అందరికీ తెలుసు. ఆ హక్కు నీవు పొందాలంటే కేసు పెట్టుకో వల్సింది నీవు-నా పిల్లలని నేను తీసుకెళ్ళడానికి నాకే కోర్టు పర్మిషనూ అక్కరలేదన్నది నీవు తెల్సుకో.... ఆడదానివి నీకింత పొగరయితే నాకు ఎంతుండాలి. ఏదో పోనీ పాపం ఏం కష్టపడుతున్నదో జరిగిందేదో జరిగింది. అంతా మర్చిపోయి మళ్ళీ కలిసివుందాం అని వస్తే కట్టుకున్న భర్తని వీధి గుమ్మంలో నిలబెట్టి యిలా మాట్లాడే నీ పొగరు ఎలా అణచాలో నాకు తెలుసు. ఏదో డిగ్రీ వుంది, ఉద్యోగం వుందనికదూ యీ మిడిసిపాటు" కసిగా అన్నాడు.

"పాపం, పోనీగదా అని వచ్చారా. నేను ఏ గతిలేకుండా ఏ కూలిపనో చేసుకుంటూ వుంటే మీకు సంతోషంగా వుండేది— నేను నా కాళ్ళ మీద నిలబడి పిల్లలని పెంచుకుంటూ వుండడం మీరెదురు చూడని విషయం. నేను హీన స్థితిలో వుంటే వచ్చి చాలా ఉదారంగా నన్ను ఆదుకోవాలని, మీరే దిక్కండి నన్ను వదలకండి అని మీ కాళ్ళ మీద పడి ఏడుస్తానని అనుకుని వచ్చారు. అలా లేకపోయేసరికి ప్లేటు ఫిరాయించారు."

"నీతో నాకు మాటలు అనవసరం. నా పిల్లలని నా కప్పగించు లేదంటే బలవంతంగా తీసికెడతాను" బెదిరింపుగా అన్నాడు.

ఒక్క క్షణం— "తీసికెళ్లు నీ పిల్లలని తీసుకెళ్లు ఎలా పెంచుకుంటావో పెంచుకో" అనాలనిపించి జయంతి మనసు ఊగిసలాడింది. ఇది ఉత్తి బెదిరింపుగాని నిజంగా పిల్లలని తీసికెళ్ళి అతను పెంచలేడు అని తెల్సినా ఏమో పంతానికి పోయి వాళ్ళని తీసికెడితే పసిపిల్లలు నిండా పదేళ్లు లేని ఆ పిల్లలు తనకి దూరమైతే వాళ్ల ఎలా బతకగలరు వాళ్ళమాట ఎలావున్నా వాళ్ళని వదులుకుని తనెలా బతకలగదు. ఈ కోపంలో మూర్ఖంగా తీసికెడితే తను ఎలా అడ్డుకోగలదు. కోర్టుకెక్కే ఆర్థిక స్తోమత తనకి లేదు. ఎక్కినా కోర్టు తీర్పు చెప్పేసరికి నెలలు సంవత్సరాలు గడిచిపోతే వాళ్ళని వదిలి ఎలా బతకగలదు! భగవంతుడు ఎంత నిర్దయుడు! ఆడదానికి మాతృత్వం అనే వరం శాపంగా కూడా మార్చాడు. ఆమె మనసు నిండా మమత నింపి ఆమె పిల్లలని వాళ్ళకి బంధంగా వేసి పురుషుడికి తల ఒగ్గి బతకమని శాసించాడు. ఆ భగవంతుడూ పురుషుడేగా! ఆ దేముడితోపాటు మన న్యాయ సూత్రాలు, నీతి సూత్రాలు అన్నీ మగవాడికి అనువుగా మార్చి ఆడదానికి ఎంత అన్యాయం చేశారు! ఈ పురుష స్వామ్య ప్రపంచంలో స్త్రీని ఏ విధంగా కట్టడిచేస్తే లొంగి వుంటుందో పురుషులు గ్రహించి ఆ సూత్రాలన్నీ న్యాయ సూత్రాలుగా ఉరితాళ్ళుగా ఆమె గొంతుక్కు బిగించారు. నవమాసాలు మోసి, కని రాత్రింబగళ్లు నిద్రాహారాలు లేకుండా శ్రమించి పెంచిన బిడ్డ తల్లికి కాక తండ్రికి చెందడం ఎంత అన్యాయం!

యింతకు మించిన అన్యాయం యింకే ముంటుంది. ఒక్క క్షణం ఆమెలో చెలరేగిన సంఘర్షణ అది! ఆమె ఊగిసలాట ఎంత దాచుకున్నా ఆమె మొహం మీద స్పష్టంగా కనిపిస్తూంది— అది అతను గుర్తించాడు. అతనికి కావల్సింది తాడు తెగే వరకూ లాగడం కాదు. ఆ తాడుకొన తన చేతిలో వుంది. ఆ తాడు తన చేతికే వస్తుంది. అని అతనికి నిబ్బరంగా తెల్సు. అంచేత, "నేను నీకు రెండురోజులు టైము యిస్తున్నాను- ఈలోగా నీవు ఆలోచించుకో. నీకు కాపురం కావాలో అక్కరలేదో, అక్కరలేదంటే పిల్లలని అప్పగించడానికి తయారుగా వుండు- నా హక్కుని ఏ విధంగానూ ఆపలేవు. ఆపాలని ప్రయత్నిస్తే నీవే నష్టపోతావు. నేను ఎల్లుండి మళ్ళీ వస్తాను. అప్పటికి నీ జవాబు సిద్ధంగా లేకపోతే పర్యవసానానికి నేను బాధ్యుడిని కాను. యిది బెదిరింపనుకోకు వస్తాను" విజయగర్వంతో ఓ విషపు నవ్వు నవ్వి వడివడిగా అక్కడనించి వెళ్ళిపోయాడు అతను. జయంతి శరీరంలో శక్తి అంతా ఒక్క క్షణంలో పోయినట్టు కింద కూలబడింది.

* * *

ఆరోజు కోర్టు కేసు తీర్పు యిచ్చే రోజు! జయంతి శరీరం అంతా చిగురుటాకులా కంపిస్తూంది. ఏ తీర్పు వినాల్సివస్తూందోనని యిరుగు పొరుగు స్కూలులో టీచర్లు మిత్రులు యిచ్చిన ధైర్యంతో, ప్రోత్సాహంతో అందరూ కల్సి చేసిన ఆర్థిక సహాయంతో కోర్టు అంటే ఎక్కింది కాని పర్యవసానం ఎలా వుంటుందోనన్న ఆందోళన ఆమెని బాగా కృంగదీసింది. ఎనిమిది నెలల తరువాత కోర్టు తీర్పు యిచ్చే రోజు వచ్చింది.

తీర్పు విన్నాక జయంతి హృదయం దూది పింజలా తేలికయిపోయింది. పిల్లలు ఆమె దగ్గిరే వుండాలని పిల్లలని ఆమెని బాధ్యతారహితంగా రెండేళ్ళు వదిలి వెళ్ళిన కారణంగా భార్య మనసు విరిగి ఆ భర్తతో కాపురం చేయననడం సమంజసమేనని, కాపురం కావాలనుకునేది వద్దనుకునేది ఆమె యిష్టానికే కోర్టు వదిలిందని, పిల్లలు చిన్నవాళ్ళు అదీకాక అంత బాధ్యతా రహితంగా ప్రవర్తించిన ఆ తండ్రి మీద కోర్టుకి నమ్మకం లేదు కనక పిల్లలు తల్లిదగ్గిరే వుండాలని, అయినా అతను తండ్రి కనక పిల్లలని ఎప్పుడు పడితే అప్పుడు చూసే హక్కు అతనికి వుంటుంది. వారానికి ఒకరోజు ప్రతి ఆదివారం అతను పిల్లలతో గడపడానికి అతనితో పిల్లలని సంపాలని, శలవుల్లో అతను కోరినప్పుడల్లా పిల్లలని పంపాలని, యిరువురు పరస్పర అవగాహనతో మళ్ళీ కావాలనుకున్నప్పుడు పెళ్ళిళ్ళు చేసుకోవచ్చని కోర్టు తీర్పు చెప్పింది.

ఆ తీర్పు విని జయంతి నిశ్చింతగా నిట్టూర్చింది. "వారానికి ఒక రోజులో ఏం వుంది కాసేపు తీసికెడతాడు శలవుల్లో నాల్గు రోజులుంచుకుంటాడు కావలిస్తే యింతేగా" అనుకుంది ఆ రోజు!

* * *

కాని ఆరు నెలలు గడిచేసరికి అప్పుడనుకున్నంత తేలిగ్గా "యింతేగా" అనుకోలేకపోతూంది యీ రోజు!

ఈ ఆరు నెలల్లో పిల్లలని మానసికంగా తనకి దూరం చేయడంలో అతనెంత విజయం సాధించాడో అర్థం అయి ఆమెలో ఏదో భయం చోటు చేసుకోసాగింది. పిల్లల లేత మనసుల్లో స్లో పాయిజన్ మాదిరి తనంటే విముఖత కల్గ చేయడంలో సఫలీకృతుడవుతున్నాడు. తన మీద కసి, కోపం, కక్ష పిల్లలని తనకి దూరం చేయడం ద్వారా సాధించి తృప్తి పడుతున్నాడు. "వారానికి ఒక్కరోజు ఏ శలవుల్లోనో నాల్గు రోజులు యింతేగా" అనుకుంది. కాని పిల్లలు ఆ వారానికి ఒక్క రోజుకోసం అంతలా ఎదురుచూస్తారని వారానికి ఆరు రోజుల్లో తల్లి తమ గురించి ఎంత కష్ట పడుతుందో తమకోసం ఎంత సుఖం త్యాగం చేసి బాధ్యత బుజాన వేసుకుందో వారు గుర్తించడం మానేశారని తెల్సుకునేసరికి ఆమె హృదయం బాధగా మూల్గింది.

మొదటి ఆదివారం "అమ్మా నీవురా నీవురాకుండా నాన్నగారితో మేం వెళ్ళం బాబూ, మాకు భయం బాబూ" అన్న పిల్లలని బుజ్జగించి నచ్చచెప్పి బలవంతంగా తండ్రి వెంట పంపితే తనని వదలలేక బిక్క మొఖాలతో తండ్రి వెంట వెళ్ళిన పిల్లలు సాయంత్రం నవ్వు మొహాలతో సంతోషంగా "ఐస్‌క్రీం యిప్పించారు నాన్న, హోటల్‌కి వెళ్ళి దోసె తిన్నాం. ముగ్గురం కేరమ్స్ ఆడుకున్నాం. మళ్ళీ ఆదివారం "జూ"కి తీసికెళ్తానన్నారు." అని ఆ రోజు విశేషాలన్నీ సంతోషంగా ఏకరువు పెడ్తుంటే "పోనీ కాస్త అలవాటయ్యారు బెంగపెట్టుకోకుండా" అని సంతోషించింది. నాల్గు వారాలు గడిచేసరికి తండ్రికోసం, ఆదివారంకోసం పిల్లలు ఎంతలా ఆరాటంగా ఎదురుచూస్తున్నారో గుర్తించేసరికి మనసు చివుక్కుమంది. తండ్రి తీసికెళ్ళిన సినిమాలు, పార్కులు, హోటళ్లు, చిరుతిళ్ళు కొనిచ్చిన బంతులు, పెన్నులు చూసుకుంటూ, చెప్పుకుంటూ వారమంతా గడిపి ఆదివారంకోసం చూసేవారు, తల్లి అనేదే వుందని మర్చిపోయినట్లు. ఎంతసేపూ తండ్రి గురించిన కబుర్లే. రెండు నెలలు గడిచేసరికి "డాడీ చాలా మంచివారు. నీవెప్పుడన్నా యిలాంటి జోళ్లు కొన్నావా, మాకసలు ఎప్పుడన్నా ఐస్‌క్రీం యిప్పించావా చక్కగా డాడీ వచ్చాక హోటలుకు తీసికెడుతున్నారు. నీవెప్పుడూ తీసికెళ్ళలేదు, బలే సినిమాలు చూస్తున్నాం. అమ్మే

ప్పుడూ తీసికెళ్ళదురా తమ్ముడూ! "అక్కా, నాన్న మంచివారే అమ్మే మంచిది కాదు, నాన్న రమ్మంటే రానంది. ఆ రోజు నాన్నని ఎంత తిట్టింది, పాపం నాన్న ఒక్కరూ వుంటున్నారుగదా అమ్మ, ఎందుకు వెళ్ళదు. అందరింట్లో అమ్మ నాన్న చక్కగా వుంటారు ఛా అమ్మవిందే మనం ఇలా ఈ ఇంట్లో వుండాల్సివస్తూంది" అంటూ పిల్లలు మాట్లాడుకునే మాటలు వింటూంటే గిలగిల కొట్టుకునేది జయంతి మనసు. ఈర్ష్యతో మనసు మండేది. తన శ్రమ, తన కష్టం వాళ్ళకోసం తను పడే బాధలు ఏమీ గుర్తించకుండా రెండు నెలల్లో తండ్రి పక్షాన చేరిపోయిన పిల్లలని చూస్తే ఏడుపు వచ్చినట్లుండేది జయంతికి. "నాన్నగారిల్లు బాగుంది కదరా రవీ చక్కగా ఫాన్లు, టి. వి, సోఫాలు అవి వున్నాయి. అంత మంచి యింటికి అమ్మ రానంటుంది. అమ్మా నీవు రాకపోతే పోనీయ్. మేము అక్కడికే వెళ్ళిపోతాం"- ఆరు నెలలు గడిచేసరికి పిల్లలు అల్టిమేటమ్ యిచ్చేశారు. ఇంకో ఆరు నెలలు పోతే పిల్లలు తనకెంత దూరం అవుతారో తల్చుకుంటే భయం కల్గింది. ఈ పిల్లలకోసం యింత కష్టపడుతూంటే వాళ్ళు తండ్రిని సమర్థిస్తూంటే యింక ఈ శ్రమ, కష్టం ఎవరికోసం! ఎవరినుద్ధరించడానికీ పంతం!

"అమ్మా మేం యీ ఎండాకాలం శలవులు రెండు నెలలు నాన్న దగ్గరే వుంటాం బాబూ యిక్కడ ఉక్క....హాయిగా అక్కడయితే ఫేన్లున్నాయి. సినిమాలు చూడడానికి టి. వీ. వుంది. శలవుల్లో డాడి పార్కులు, సినిమాలు అవి తీసికెడతా నన్నారు, మేం యిక్కడుండం బాబూ" అన్న పిల్లలని గుడ్లప్పగించి చూస్తూ వుండి పోయింది జయంతి.

"అమ్మా....అమ్మా....!" రవి కుదుపుతూంటే తుళ్ళి పడి లేచింది జయంతి. బారెడు పొద్దెక్కిపోయింది. అయోమయంగా పిల్లలని చూసింది. ఇదంతా కలా! తెల్లవారుఝామున వచ్చిన కలాయిది! 'ఆరయిపోయింది. ఇంకా పడుకున్నా వేమిటి అమ్మా" స్వర్ణ అడుగుతూంటే దిగ్గున లేచి పనుల్లో జొరపడింది జయంతి. పని చేస్తున్నంతసేపు ఆలోచనలే. ఆ సాయంత్రం ఒక వారపత్రికలో "ఆదివారం తండ్రులు" అనే వ్యాసం చదివింది. విదేశాల్లో విడిపోయిన భార్యాభర్తల గురించి వ్యాసం అది! పిల్లలని అనువుగా పెట్టుకుని వారి పసి మనసులు దోచుకోడానికి వారికి అన్ని రకాల ఖరీదయిన వస్తువులు కొనిస్తూ పార్కులు, హోటళ్ళకు తీసికెళ్ళి మంచి చేసుకుని వాళ్ళని ఆకట్టుకుని తల్లి పట్ల విముఖత కలిగిస్తూ వారిని తనవైపు తిప్పుకోడానికి ఎంత తాపత్రయపడ్తారో చెప్పే వ్యాసం అది! అది చదివాక రాత్రి ఆలోచిస్తూ పడుకుంటే అదే కలలోకి వచ్చిందన్న మాట! రేపు మన దేశంలోనూ ఈ "ఆదివారం తండ్రులు" ప్రవేశిస్తారా? యిలా విడాకులు పొందితే యిలాంటి తండ్రులు బయలుదేరి పిల్లల మనసుల్లో విషం నింపి తల్లికి దూరం చెయ్యాలని

ప్రయత్నిస్తే. ఊహూ....వీలులేదు. బాధ్యతారహితంగా పిల్లలని పాడుచేసే తండ్రుల కంటె బాధలు పెట్టే భర్తని భరించడం నయమేమో? కన్నతల్లిగా, వారి క్షేమం కోరే తల్లిగా వారికోసమన్నా భర్తని భరిస్తుంది ఈ దేశం స్త్రీ! అందుకే భర్తలు ఎంత బాధపెట్టినా పిల్లలకోసం సహిస్తూ పడివుండే భార్యలున్న యీ దేశంలో పిల్లల కింకేంవున్నా లేకపోయినా తల్లిదండ్రుల యిద్దరి ప్రేమ లభిస్తుంది పుష్కలంగా. బాధ్యత తీసుకోకుండా పిల్లలని పాడుచేసే అవకాశం యిచ్చేకంటే తండ్రులకి బాధ్యత అప్పగించితేనే నయం! తనకి భర్త అవసరం లేకపోయినా బిడ్డలకి తండ్రి అవసరం వుంది! బిడ్డల ఆ హక్కుని తను పంతంతో, కోపంతో పోగొడితే రేపు పిల్లలే తనకి ఎదురు తిరిగితే యింక యీ పంతానికి అర్థం ఏముంది! ఇన్నాళ్ళు "యీ ఆడవాళ్ళంతా భర్తలెంత హింసించినా ఎందుకు పడుంటారో" అని వారిమీద జాలి పడేది! యిప్పుడు....యిప్పుడు తనని చూసి తనే జాలి పడాలేమో!

మర్నాడు వచ్చే భర్త ముందు తల ఒగ్గడానికి సిద్ధపడింది జయంతి....పిల్లల కోసం! యీ దేశంలో ఆడది అంతకంటె ఏం చెయ్యలేని నిస్సహాయురాలు! "మాతృత్వం స్త్రీకి వరమన్న" వాళ్ళని షూట్ చెయ్యాలి" అనుకుంది కసిగా జయంతి– ఆ వరమిచ్చిన వేల్పుని ఏం చెయ్యాలి!

["ఆదివారం తండ్రులు" అనే వ్యాసం చదివాక]

★

# పురోగమనానికి పునాదిరాళ్ళు

"స్సారీ సునీతా. ఐయామ్ వెరీసారీ. ఐయామ్ హెల్ప్‌లెస్....కమిటీ మెంబర్లంతా తేల్చాక నేను ప్రతిసారి కలుగజేసుకోడం బాగుండదుగదా...." ప్రిన్సిపాల్ జయలక్ష్మి తేల్చి చెప్పేసింది. సునీత నిట్టూర్చి కుర్చీలోంచి లేచి నిలబడింది. నిజమే, ఎవరు ఎన్నాళ్ళు సహాయం చేస్తారు. ఆరేళ్ళ బట్టీ ఎలాగో ట్రాన్స్‌ఫర్ లేకుండా ప్రతిసారి ఎవరినో పట్టుకుని బతిమిలాడి ఆపుచేయించుకుంటోంది.

"సునీతా ప్రతీవాళ్ళకీ ఏవో యిబ్బందులుంటాయి ఉద్యోగం అన్నాక. వున్న వూర్లోనే వుండాలంటే ఎలా కుదురుతుంది. యిల్లు, మొగుడు, పిల్లలు, చదువులు యీ బాదర బందీలు మనందరికీ వున్నవే."